# పోరాడి వేతన ఒప్పందం సాధించుకున్న హమాలీలు

**విజయనగరంజిల్లా** మక్కువ మండల కేంద్రంలో వివిధ వ్యాపారస్తుల వద్ద 100మంది కళాసీ కార్మికులు లోడింగ్ అన్‌లోడింగ్ పనులు చేస్తూవున్నారు. వారితోపాటు మరో 10 గ్రామాలలో 150 మంది కళాసీ కార్మికులు(హమాలీలు) జూటు, పత్తి, ధాన్యం, మొక్కజొన్న – తూనిక, లారీలోడింగ్ చేస్తూ జీవనం సాగిస్తూ వున్నారు. వీరిలో 90% మంది నిరక్షరాసులే. వీరి జీవన పరిస్థితులు దినదినగండంగా వున్నాయి. సంవత్సరకాలములో 6 నెలలు పనివుంటే, మిగతా కాలంలో అరకొరగా పనులుతప్ప, పూర్తిగా పనివుండదు. అందుచేత కళాసీ కుటుంబాలలో మిగతాసభ్యులు ఇతర కూలిపనులు చేస్తే తప్ప కుటుంబాలు గడవటం కష్టం. కళాసీ కార్మికుల్లో అత్యధికులు మద్య వ్యసనానికి లోబడిపోయారు. అందువలన వారికి వస్తున్న కూలీ డబ్బులో 50% ఇంటికి చేరదు. వ్యాపారస్తుల ఇళ్లలో జరిగే శుభకార్యాలలో కళాసీలచే వెట్టిచాకిరీ చేయించుకునే పరిస్థితి కొన్నిచోట్ల కొనసాగుతోంది. కళాసీలకు పీసురేటు తప్ప (పనిని బట్టి కూలి) బోనస్ -పిఎఫ్, వైద్యసదుపాయాలులేవు. ఒప్పంద కాలపరిమితి కూడా, మక్కువ – బొబ్బిలిలో 2 సం॥లు వుండగా, మిగతా కేంద్రాలలో కూలీరేట్ల ఒప్పంద కాలపరిమితి మూడు సం॥లుగా వుంది. సంఘం ఏర్పడిన తరువాత మెరుగైన కూలీరేట్ల పెంపుదలకు సంబంధించి మంచి కృషి జరిగింది. ఇటీవలే ఈ సంఘానికి మక్కువలో సొంత ఆఫీసు కూడా నిర్మించుకున్నారు.

వర్తకసంఘానికి, కళాసీసంఘానికి మధ్యకుదిరిన వేతన ఒప్పందం 2015 నవంబరు 28 తేదికి ముగుస్తూండటంతో నవంబరు 29 నుండి కొత్త ఒప్పందం రావలసియున్నది. కొత్తవేతన ఒప్పందం కోసమై మక్కువ ఏరియా కళాసీసంఘం (ఏఐఎఫ్‌టియు – న్యూ అనుబంధం) చర్చలు ఏర్పాటు చేయమని కోరుతూ, మక్కువ వర్తక సంఘానికి 20-1-15న ఒక లేఖ రాసింది. దీనికి స్పందన లేకపోవడంతో ప్రస్తుతం వున్న పీసురేట్లకి జూటు పనికి 60% ఇతర బస్తాల పనికి 40% అమలు చేయాలని కోరుతూ 29-1-2015న మరొక లేఖ రాసింది. దానిపై వరక్త సంఘంవారు 'మీరు కోరిన రేట్లు మేము అమలు చెయ్యలేము, డిశంబరు 20వ తేది తరువాత చర్చలు ఏర్పాటుచేస్తామ'ని కళాసీసంఘానికి సమాధానమిచ్చారు. దీనిపై కళాసీ సంఘం జనరల్‌బాడీ జరిపి వరక్త సంఘం వారి నిర్లక్ష్యవైఖరిని ఖండిస్తూ కొత్త ఒప్పందం కోసం సమ్మె చేపట్టాలని తీర్మానం చేశారు.

ఈ మేరకు డిశంబరు 14 నుండి సమస్య పరిష్కారం అవకుంటే సమ్మెలో పాల్గొంటామని వర్తక సంఘానికి డిశంబరు 5న తెలియపరిచారు. అదేవిధంగా సమస్య పరిష్కారం కోరుతూ, మక్కువ తాసీల్దారుకు, లేబరు అధికారులకు వ్రాతపూర్వకంగా తెలియజేశారు. డిశంబరు 14 నుండి సమ్మె ప్రారంభమైంది. అప్పటికీ వర్తక సంఘం వారు సమస్య పరిష్కారం చెయ్యడానికి బదులుగా, సమ్మె విచ్ఛిన్నానికై ప్రయత్నాలు చేశారు. స్థానిక రాజకీయనాయకుల ద్వారా, పోలీసు వారిద్వారా, సంఘంపై అనేక ఒత్తిడులు తెచ్చినప్పటికీ, అన్ని ఒత్తిడులనూ అధిగమించి హమాలీ కార్మికులు సమ్మెను కొనసాగిస్తూ, డిశంబరు 22వ తేదీన తాలూకాఫీసుముందు ధర్నా చేపట్టారు. సమ్మెను బలపరుస్తూ, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా ప్రధాన నాయకత్వంతోపాటు 80మంది సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా బొబ్బిలి కళాసీ సంఘం నాయకత్వంతోపాటు 10 మంది ఈ ధర్నాలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ధర్నా అనంతరం 300 మందితో మక్కువలో ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమం జరుగుతున్న క్రమంలోనే, లేబరు అధికారుల్లో కదలిక వచ్చి డిశంబరు 23న ఉభయుల మధ్య చర్చలు ఏర్పాటుచేశారు.

డిశంబరు 25వ తేదీన నూతన వేతన ఒప్పందం జరిగింది. ప్రస్తుతం అమలు చేస్తున్నరేట్లపై జూట్‌లో పనిచేసే వారికి 45%, మిగతా రంగాలలో పనిచేస్తున్న వారికి 25% పెంచుతూ రెండేళ్ళపాటు అమల్లో వుండే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. కళాసీలు వారి వేతన ఒప్పందంకోసం సాగించే సమ్మె పోరాటంలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) సంపూర్ణ మద్దతు ప్రకటించడమే కాకుండా ప్రధాన నాయకత్వం సమ్మె కాలంలో కార్మికుల మధ్య వుండడం కళాసీకార్మికులకు మంచి దన్నునిచ్చింది.

ooooo